మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం
R.NO. T/TG/2026/0111/2018/1268

విలేఖరులు కావలెను...
విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియెజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.
వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.
9390 875876

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 20 ఆదివారం 24 మే 2026 పేజిలు :08 వెల:రూ.5/-

## రెండో విడత ఇందిరమ్మ

# ఇళ్లకు ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల మంజూరు
- ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల కేటాయింపు
- జూన్ 1న రెండో విడత ప్రారంభించనున్న సీఎం
- కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం




**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
రాష్ట్రంలో రెండో విడత కింద 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లతో పాటు పలు కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు.ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని 24 నియోజకవర్గాల్లో కూడా 1 లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ఇంటి స్థలం లేని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్రంలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న 15 వేల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందించాలని తీర్మానించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో మిగతా 2 లో..

## ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సంస్థల అండ

- తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి భారీ సిఎస్ఆర్ నిధులు
- ప్రభుత్వ విద్యాసంస్థల ఆధునికీకరణకు ఒప్పందాలు
- సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఎంఓయూలు
- పాఠశాల మౌలిక వసతుల బలోపేతానికి చర్యలు



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యారంగ బలోపేతానికి మిగతా 2 లో..

## తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ పాలన ఉదాహరణ

- 2014 నుంచి 2023 వరకు ఆర్థిక ప్రగతిలో దూసుకెళ్లిన రాష్ట్రం
- రాష్ట్ర ఆదాయంలో 37 శాతం వృద్ధి నమోదు
- తలసరి ఆదాయం రూ.3.47 లక్షలకు పెరిగిన తెలంగాణ
- ఐసీఏఐ కాన్వొకేషన్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
2014 నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఐసీఏఐ కాన్వొకేషన్ 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం 37 శాతం పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఆర్థిక వనరుల పెంపుతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమైందన్నారు. సంక్షేమం, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధి సమన్వయంతో తెలంగాణ దేశంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. 2013--14లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.97 వేలుగా ఉండగా, 2023--24 నాటికి అది రూ.3,47,299కు పెరిగిందని కేటీఆర్ వెల్లడించారు. దేశంలో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన మిగతా 2 లో..




## హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్



2 లో..

## భారత్-అమెరికా వ్యూహాత్మక బంధం



2 లో..

# దేశంలో నకిలీ లాయర్ల కలకలం

### 40 శాతం వరకు నకిలీ న్యాయవాదులే బార్ కౌన్సిల్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 23మన ప్రజాగళం:**
దేశవ్యాప్తంగా కోర్టుల్లో నల్ల కోట్లు వేసుకుని ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల్లో భారీ సంఖ్యలో నకిలీ లాయర్లు ఉన్నారంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశంలో దాదాపు 35 నుంచి 40 శాతం వరకు న్యాయవాదులు నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నారని బీసీఐ




మిగతా 2 లో..

విలేఖరులు కావలెను...
విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియెజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.
వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.
9390 875876

# గగనతలం మూసేసిన ఇరాన్

- దాడులకు ట్రంప్ సిద్ధం
- పశ్చిమాసియాలో ఆందోళనలు

**న్యూఢిల్లీ, మే 23 మన ప్రజాగళం:**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌పై కొత్త సైనిక దాడులకు అమెరికా సిద్ధమవుతోందన్న వార్తలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది.




పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుని తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. శాంతి చర్చలు నిలిచిపోవడం, అణు కార్యక్రమంపై విభేదాలు మరింత ముదరడంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా మీడియా సంస్థ సీబీఎస్ న్యూస్ కథనం ప్రకారం రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి కనిపించకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా సైనిక, నిఘా విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు తమ సెలవులను రద్దు చేసుకుని అత్యవసర సమావేశాల్లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది.పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ట్రంప్ తన వారాంతపు న్యూజెర్సీ పర్యటనను కూడా రద్దు చేసుకుని హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వెళ్లారు. అంతేకాకుండా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహ కార్యక్రమానికి మిగతా 2 లో..

## లడాఖ్‌లో కుప్పకూలిన ఆర్మీ చాపర్



2 లో..

## గోల్డెన్ సిటీ జైసల్మేర్‌లో నీటి కష్టాలు



2 లో..

# హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్

**వడగాల్పులతో ఏడు జిల్లాల్లో 16 మంది మృతి**

**మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం**

**కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు**

**ప్రజల ప్రాణ రక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు**

**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాల్పుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అత్యవసర అప్రమత్తత చర్యలు చేపట్టింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా సమీక్షించిన మంత్రి, వడదెబ్బ కారణంగా ఏడు జిల్లాల్లో 16 మంది మరణించినట్లు అధికారుల నివేదికల ద్వారా తెలుసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు అధికారులు వివరించారు.



దీనిపై స్పందించిన మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రతి మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆదేశించారు.

ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుందని, ఎల్‌నినో ప్రభావంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా ప్రతి స్థాయిలో అప్రమత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ఎండలపై అవగాహన కల్పించాలని సూచించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి తెలిపారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ, నిర్మాణ రంగ కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి జిల్లా కలెక్టర్ హీట్ వేవ్ పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు ఫీల్డ్‌లో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలతో పాటు పక్షులు, జంతువుల రక్షణ కూడా ముఖ్యమని గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 26 వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతలు కొనసాగనున్నాయని మంత్రి వెల్లడించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించి అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# భారత్-అమెరికా వ్యూహాత్మక బంధం

**అమెరికా విదేశాంగ కార్యదర్శికి మోదీ స్వాగతం**

**ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు**

**ప్రపంచ శాంతి, భద్రత అంశాలపై సమాలోచనలు**

**గ్లోబల్ మేలుకోసం కలిసి పనిచేస్తామన్న భారత్-అమెరికా**



**న్యూఢిల్లీ, మే 23 మన ప్రజాగళం:**
భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలకు సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా మోదీ, మార్కో రూబియో మధ్య సమాలోచనలు జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. భారత్, అమెరికా దేశాలు ప్రపంచ మేలుకోసం భవిష్యత్తులోనూ కలిసి పనిచేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పరస్పర సహకారంతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే దిశగా ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత బలోపేతం కానుందని భావిస్తున్నారు. ఇటీవల కాలంలో భారత్-అమెరికా సంబంధాలు మరింత బలపడుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత వంటి కీలక రంగాల్లో ఇరు దేశాలు ఇప్పటికే సన్నిహితంగా పనిచేస్తున్నాయి. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా భారత్‌తో భాగస్వామ్యానికి అమెరికా అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నట్లు సమాచారం. ప్రపంచ స్థాయిలో శాంతి, స్థిరత్వం కోసం భారత్‌తో కలిసి పనిచేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్-అమెరికా మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సంబంధాలు ప్రపంచ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. రాబోయే కాలంలో ఇరు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని దౌత్య వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# లడాఖ్‌లో కుప్పకూలిన ఆర్మీ చాపర్

**తృటిలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు సైన్యాధికారులు**

**ప్రమాద స్థలంలో సెల్ఫీ దిగిన మేజర్ జనరల్**



**న్యూఢిల్లీ, మే 23మన ప్రజాగళం:**
లడాఖ్‌లో భారత సైన్యానికి చెందిన చీతా హెలికాప్టర్ కూలిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లేహ్ సమీపంలోని తంగ్సే ప్రాంతంలో మే 20న ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తాజాగా ధృవీకరించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ఉన్నతస్థాయి సైన్యాధికారులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. సైన్యాధికారుల వివరాల ప్రకారం.. కూలిన హెలికాప్టర్‌లో లెఫ్టినెంట్ కల్నల్, ఓ మేజర్ పైలెట్‌తో పాటు 3వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌కు చెందిన మేజర్ జనరల్ సచిన్ మెహతా ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురికీ గాయాలైనప్పటికీ ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం అనంతరం కూలిపోయిన హెలికాప్టర్ వద్ద మేజర్ జనరల్ సచిన్ మెహతా దిగిన సెల్ఫీ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కొండ ప్రాంతంలోని రాళ్ల మధ్య కూలిపోయిన హెలికాప్టర్ పక్కన కూర్చుని తీసుకున్న ఆ ఫోటో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. తీవ్ర ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడటాన్ని చాలామంది అద్భుతంగా అభివర్ణిస్తున్నారు. లడాఖ్ వంటి ఎత్తైన పర్వత ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు తరచూ మారుతూ ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో పాత చీతా హెలికాప్టర్లు సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సమాచారం. ఈ ఘటనపై సైన్యం అధికారిక దర్యాప్తుకు ఆదేశించింది. చీతా హెలికాప్టర్లను భారత సైన్యం 1970 దశకంలో వినియోగంలోకి తీసుకువచ్చింది. 1984లో జరిగిన ఆపరేషన్ మేఘదూత్ సమయంలో సియాచిన్ గ్లేసియర్ ప్రాంతంలో ఈ హెలికాప్టర్లు కీలక పాత్ర పోషించాయి. ఎత్తైన ప్రాంతాల్లో ప్రయాణాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ హెలికాప్టర్లలో ఐదుగురు వరకు ప్రయాణించవచ్చు. అయితే గతంలో కూడా చీతా హెలికాప్టర్లు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ ప్రమాదాల్లో పలువురు పైలెట్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజా ఘటనతో మరోసారి చీతా హెలికాప్టర్ల భద్రతపై చర్చ మొదలైంది.

# రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి..)

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రూ.1000 కోట్లు కేటాయించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి భూసేకరణ, పునరావాసం, మౌలిక వసతుల కోసం రూ.587 కోట్లు మంజూరు చేసింది.విద్యుత్ పంపిణీ, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ డిస్కంల ప్రతిపాదనలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను హాకాలో విలీనం చేయాలని నిర్ణయించింది. 2030 నాటికి తెలంగాణను ప్రపంచంలోని టాప్-5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలనే లక్ష్యంతో నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు, 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈ పాలసీ రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సంస్థల అండ

(మొదటి పేజీ తరువాయి..)

ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల కింద రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో సచివాలయంలో పాఠశాల విద్యాశాఖతో ఈ మూడు సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి, మౌలిక వసతుల ఆధునికీకరణ కోసం ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. ఒప్పంద పత్రాలను నీల్ రహేజా, అల్లా దక్షయాణి, గోరుకంటి దేవేందర్ రావు ముఖ్యమంత్రికి అందజేశారు. రామ్‌కీ ఫౌండేషన్ మెదక్-మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్‌నగర్‌లో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు సమగ్ర విద్యా క్యాంపస్ నిర్మాణానికి మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వాటాగా రూ.19.66 కోట్లు అందించనుంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కూడా రూ.10.4 కోట్లు కేటాయించనుంది.కే రహేజా గ్రూప్ రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ స్థాయి వరకు విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి రూ.50.50 కోట్లు ఖర్చు చేయనుంది. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. యశోద ఫౌండేషన్ ఉప్పల్ సుభాష్‌నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ, 6వ, 7వ తరగతుల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.12.20 కోట్లు అందించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ పాలన ఉదాహరణ

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో నిలిచిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితమే ఈ ప్రగతని తెలిపారు.స్టార్టప్ రంగంలో కూడా తెలంగాణ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. పదేళ్లలోనే భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందన్నారు. యువతకు అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం అనేక ప్రోత్సాహక విధానాలు అమలు చేసిందని వివరించారు. పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయం, మౌలిక వసతుల రంగాల్లో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కేటీఆర్ అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలు తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా గుర్తించాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణం ప్రజల సహకారంతో సాధ్యమైందని కేటీఆర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా కృషి కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఐసీఏఐ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.ం

# దేశంలో నకిలీ లాయర్ల కలకలం

(మొదటి పేజీ తరువాయి..)

నకిలీ డిగ్రీలను కొనుగోలు చేయడం లేదా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించడం ద్వారా పలువురు కోర్టుల్లో న్యాయవాదులుగా కొనసాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారం బార్ కౌన్సిల్ దృష్టికి వచ్చిందని, ఇప్పటికే దీనిపై ప్రత్యేక చర్యలు ప్రారంభించామని తెలిపారు. నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అరికట్టేందుకు బీసీఐ దేశవ్యాప్తంగా న్యాయవాదుల విద్యార్హతల పరిశీలన చేపట్టింది. అడ్వకేట్ల డిగ్రీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఫారాలు సమర్పించాలని కోరగా, దాదాపు 40 శాతం మంది ఇప్పటివరకు వెరిఫికేషన్ ఫారాలు నింపలేదని వెల్లడించారు. ఫారాలు సమర్పించని వారిపై బీసీఐ అనుమానం వ్యక్తం చేస్తోంది.ఈ అంశాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు భంగం కలిగించే ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన "కాక్రోచ్ జనతా పార్టీ" వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. గత వారం ఒక పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కొందరు నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్నారని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. అలాంటి వారినే ఉద్దేశిస్తూ "కాక్రోచ్" అనే పదాన్ని ఉపయోగించారని స్పష్టం చేశారు. నకిలీ డిగ్రీల వ్యవహారంపై అవసరమైతే సీబీఐ దర్యాప్తు కూడా కోరే అవకాశముందని బీసీఐ వర్గాలు సూచిస్తున్నాయి. న్యాయవృత్తి పవిత్రతను కాపాడేందుకు కఠిన చర్యలు తప్పవని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# గగనతలం మూసేసిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి..)

కూడా హాజరుకాలేనని ప్రకటించడం పరిస్థితి ఎంత గంభీరంగా ఉందో తెలియజేస్తోంది. "ప్రస్తుతం దేశ భద్రతకు సంబంధించిన అంశాలు అత్యంత ప్రాధాన్యమైనవి. అందుకే వాషింగ్టన్‌లోనే ఉండాల్సి వస్తోంది" అంటూ ట్రంప్ తన సోషల్ మీడియా వేదికలో పేర్కొన్నారు.గత ఏప్రిల్‌లో అమెరికా ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగుతున్నప్పటికీ ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వల అంశంపై నెలకొన్న ప్రతిష్టంభన ఉద్రిక్తతలకు ప్రధాన కారణంగా మారింది. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పెంచుకుంటోందన్న అనుమానాలతో అమెరికా కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం బయటకు తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. అణ్వాయుధ తయారీకి అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేస్తోంది. అయితే తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చిచెబుతోంది. ఇది తమ సార్వభౌమ హక్కులకు సంబంధించిన అంశమని, అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది.ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇరాన్ గగనతలం మూసివేయడం, అమెరికా సైనిక కదలికలు పెరగడం, దౌత్య చర్చలు నిలిచిపోవడం వంటి పరిణామాలు ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు మార్కెట్లపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# గోల్డెన్ సిటీ జైసల్మేర్‌లో నీటి కష్టాలు

**జైసల్మేర్, మే 23 (మన ప్రజాగళం:**
రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన జైసల్మేర్ తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గోల్డెన్ సిటీగా పేరుగాంచిన ఈ ఎడారి నగరంలో గత పది రోజులుగా నల్లాల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండిపోతున్న ఎండలు, వడగాలుల మధ్య నీటి కొరత ప్రజల జీవనాన్ని మరింత కష్టతరం చేసింది. జైసల్మేర్‌లో ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఎడారి ప్రాంతం కావడంతో వేడి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తాగునీరు అందకపోవడంతో ప్రజలు నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. మున్సిపల్ ట్యాంకర్లు నాలుగు నుంచి ఐదు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు సరఫరా చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు.ఈ పరిస్థితిపై రాజస్థాన్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు స్పందించారు. స్థానిక కాలువకు సంబంధించిన నిర్వహణ పనుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల నల్లాల ద్వారా నీరు సరఫరా చేయలేకపోతున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిరంజన మీనా వెల్లడించారు. ప్రస్తుతం నగరంలోని ఏడు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరో మూడు రోజుల్లో నల్లాల ద్వారా సాధారణ నీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

# నిల్వ ఉన్న వరి ధాన్యం కొనుగోలు చేయాలి

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్



**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:** నిల్వ ఉన్న వరి ధాన్యం, మొక్క జొన్న కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని, తరుగు పేరుతో రైతులను మోసం చేయడం తగదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ తో కలిసి సాగర్ సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్ని బ్యాగులు సమకూర్చి లారీలను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. మార్కెట్ యార్డులో వరి ధాన్యం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వరి ధాన్యం మద్దతు ధరకు అమ్ముదామని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి నిరీక్షణ తప్పడం లేదని, గన్నీ బ్యాగుల కొరత, హమాలీల పేరుతో కాంటాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కాంటాలు వేసినా పంటను తరలించడానికి లారీలు రావడం లేదన్నారు. ధాన్యం దిగుబడిపై మూడు నెలల కిందటే మార్కెటింగ్ అధికారులకువ్యవసాయ శాఖ స్పష్టమైన నివేదిక ఇచ్చినా ముందు చూపు లేకుండా వ్యవహరించడం వల్లే ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారుఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి 80% దాన్యం కొనుగోలు చేశామని తప్పుడు ప్రకటనలు చేస్తూ రైతాంగాన్నే మోసం చేస్తు, ధాన్యం కొనుగోలు నుండి తప్పుకునే ప్రయత్నం చేయడం సిగ్గుమాలిన చర్య అని అదేవిధంగా జనగామ జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంట వేసిన ధాన్యం రైస్ మిల్లు వద్ద వెళ్ళగానే తాను తరుగు మట్టి పేరుతో నాలుగు కిలోల వరకు 40 కిలోల బస్తాలు పరుగు తీస్తూ రైతాంగానికి తీవ్రంగా నష్టపరుస్తున్నారని అదేవిధంగా రైస్ మిల్లు యజమానులు రైతుల వద్ద బస్తాకు 30 రూపాయల చొప్పున మిల్లుల వద్ద దిగుమతికి హమాలీ ఖర్చులు వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఐకెపి పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శిస్తూ కాలం వెల్లదీస్తున్నారు కానీ రైస్ మిల్లుల మోసాల పట్ల రైస్ మిల్లర్లు రైతులను చేస్తున్న దగా పట్లా జిల్లా కలెక్టర్ కన్నెత్తి చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా సొంత వాహనాలలో ధాన్యం తరలిస్తున్న రైతన్నకి ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టు తీవ్రంగా మోసం చేస్తున్నారని ట్రాన్స్పోర్ట్ చార్జీలు ఇవ్వకపోవడం దారుణమని దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని అన్నారు లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, ఉర్సుల కుమార్ మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కమిషనర్ ను సస్పెండ్ చేయాలి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహిస్తున్న ఈ సమయంలో జనగామ పట్టణంలో పలు ప్రజా సమస్యల కోసం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ లో దరఖాస్తు చేసుకొని నెల రోజుల సమయం గడుస్తున్న ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఇటీవల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్ జనగామ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రజా సమస్యలపై అడగడం కోసం ఆఫీసుకు వస్తే ఒక బాధ్యత యుతమైనటువంటి పదవిలో ఉండి మున్సిపల్ కమిషనర్ వేటకార మాటలతో సమస్యలను అవహేళన చేయడం జరిగిందన్నారు ఈగం శ్రీనివాస్ మాట్లాడుతూ. మున్సిపల్ కమిషనర్ పూర్తి స్థాయిలో ఎటువంటి బాధ్యత లేకుండా మాట్లాడటం తన యొక్క గౌరవప్రదమైన పదవికి సరైన సమాధానాలు కావు అన్నారు ఎవరైనా చనిపోయారా. డయేరియా. మలేరియా.వచ్చిందా అంటే ప్రజలు చస్తేనే పనిచేస్తార. ప్రజల కొరకు నియమింప పడ్డ గౌరవ పదవిలో ఉండి ఇలా మాట్లాడడం సరికాదన్నారు. వీరి పైన కలెక్టర్ గారికి ఫిర్యాదు కూడా చేయడం జరిగింది అన్నారు. తదుపరి మానవ హక్కుల సంఘం మరియు సిడి ఎంఎ వారికి కూడా ఫిర్యాదు చేయడం జరుగుతుంది అని అన్నారు. జిల్లా కలెక్టర్ వీరి పైన తగిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని కోరారు. లేని యెడల ఆమరణ నిరాహార దీక్ష చేపడుతానని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం కొరకు ప్రజల కొరకు ఎన్నో ఉద్యమాలు చేశానన్నారు. ప్రజలు అంటే ఇంత చులకనా. అని అన్నారు



# స్టార్‌షిప్ పరీక్ష విజయవంతం

**స్పేస్ఎక్స్ భారీ ప్రయోగం**

**హిందూ మహాసముద్రంలో ల్యాండింగ్**

**ఎలన్ మస్క్ ప్రశంసలు**

**టెక్సాస్, మే 23 మన ప్రజాగళం:** ప్రపంచంలోనే అత్యంత భారీ, శక్తివంతమైన రాకెట్‌గా గుర్తింపు పొందిన స్టార్‌షిప్ వీ3ను స్పేస్ఎక్స్ సంస్థ విజయవంతంగా పరీక్షించింది. బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన ఈ సంస్థ మూడవ తరం స్టార్‌షిప్ రాకెట్‌ను శుక్రవారం టెక్సాస్ నుంచి ప్రయోగించింది. గంటకు పైగా సాగిన ఈ టెస్ట్ ఫ్లైట్ అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. అనంతరం రాకెట్ హిందూ మహాసముద్రంలో విజయవంతంగా దిగినట్లు స్పేస్ఎక్స్ ప్రకటించింది. ఈ పరీక్షలో భాగంగా స్టార్‌షిప్ రాకెట్ పలు కీలక లక్ష్యాలను చేరుకున్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే ముందస్తు ప్రణాళిక ప్రకారమే రాకెట్‌ను సముద్రంలో పేల్చివేసినట్లు తెలిపింది. రాకెట్ పనితీరు, వేడి నిరోధక వ్యవస్థలు, అంతరిక్ష ప్రయాణ సామర్థ్యాలను పరిశీలించేందుకు ఈ ప్రయోగం నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రయోగం ద్వారా భవిష్యత్తులో చంద్రుడు, అంగారక గ్రహ యాత్రలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపరచే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.టెస్ట్ ఫ్లైట్ సందర్భంగా స్టార్‌షిప్ నుంచి 22 మాక్ శాటిలైట్లను కూడా విడుదల చేశారు. అలాగే రాకెట్‌కు అమర్చిన హీట్ షీల్డ్ పనితీరును విశ్లేషించేందుకు ప్రత్యేకంగా మరో శాటిలైట్‌ను పంపించారు. అంతరిక్షంలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యంపై ఈ ప్రయోగం కీలక సమాచారాన్ని అందించనుందని స్పేస్ఎక్స్ తెలిపింది. అయితే రాకెట్ అనుకున్న కక్ష్యలో పూర్తిగా ప్రయాణించలేదని సంస్థ అంగీకరించింది. ప్రయోగ సమయంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు స్పేస్ఎక్స్ వెల్లడించింది. రాకెట్ మంటలు అంటుకునే దశలో ఒక ఇంజిన్ విఫలమైనట్లు గుర్తించినట్లు తెలిపింది. అదేవిధంగా రాకెట్‌కు అనుసంధానించిన సూపర్ హెవీ బూస్టర్ కూడా అనుకున్న స్థాయిలో పనిచేయలేదని పేర్కొంది. ఆ బూస్టర్ చివరకు గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో పడిపోయినట్లు సమాచారం. ఈ లోపాలపై ఇప్పటికే సాంకేతిక బృందాలు విశ్లేషణ ప్రారంభించాయి.ప్రయోగం అనంతరం స్పేస్ఎక్స్ సంస్థ తమ ఎక్స్ ఖాతాలో సముద్రంపై స్టార్‌షిప్ దిగిన దృశ్యాలను పంచుకుంది. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగ నిపుణులు, సాంకేతిక వేత్తలు ఈ ప్రయోగంపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. మానవాళిని అంతరిక్షంలో కొత్త దశకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. స్పేస్ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ ఈ ప్రయోగాన్ని “ఎపిక్ ఫ్లైట్”గా అభివర్ణించారు. మానవాళి భవిష్యత్తు లక్ష్యాలకు ఇది గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో మరింత వేగంగా ముందుకు సాగేందుకు ఇలాంటి ప్రయోగాలు కీలకమని ఆయన తెలిపారు. చంద్రుడు, అంగారక గ్రహాలపై మానవ నివాసాల కలను సాకారం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మస్క్ మరోసారి స్పష్టం చేశారు.



# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:** కీర్తిశేషులు మేడిపల్లి కళ్యాణ్ జయంతి సందర్భంగా అన్నదమ్ములు మేడిపల్లి కార్తీక్, పవన్ మరియు స్నేహితులు నరేష్ సందీప్ శ్రీకాంత్ రాజు దినేష్ శివ సంపత్ రామ్ సోహెల్ లింగం విజయ అరవింద్ జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్దకు వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఘనంగా స్మరించుకున్నారుఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన కీర్తిశేషులు మేడిపల్లి కళ్యాణ్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణే లక్ష్యంగా ప్రజలు యువత వారి పుట్టినరోజు పెళ్లిరోజు మరియు సందర్భం ఏదైన కానీ ఆకలితో ఉన్నవారికి మీమి గ్రామ స్థాయి పట్టణ స్థాయిలో నిరుపేదలకు నిరాశ్రయులకు అనాథలకు ఒక పూట ఆకలి తీర్చి మానవత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారుఈ సేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యాడ రవి, ఎండి అఫ్రోజ్, నారదాసి రవి, సిద్ధిరాల చందు, సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు

# సీఎం కప్ సిల్వర్ మెడల్ సాధించిన జనగాం జిల్లా విద్యార్థులు

**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:** స్పోర్ట్ అథారిటీ తెలంగాణ నిర్వహించిన సీఎం కప్ గేమ్స్ గ్రామాల నుండి జాతీయస్థాయికి అనే లక్ష్యంతో జరిగిన పోటీలో తరిగొప్పుల మండల్ అబ్దుల్ నాగారం చెందిన భాషబోయిన రమ్య, కరాటే 59 కేటగిరిలో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో జనగామ జిల్లాకు సిల్వర్ మెడల్ సాధించడం జిల్లాకే గర్వకారణం అని జె, కె, ఎ,ఐ, జనగామ జిల్లా సెక్రెటరీ మాస్టర్ కొయ్యడ రవి నీ అభినందించిన జనగామ జిల్లా అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, జి, సి, డి, ఓ, గౌసియా బేగం, డి,వై,ఎస్,ఓ, ఎ,జి, ఎఫ్, సెక్రటరీ, జనగామ జిల్లాకు మరెన్నో పథకాలు తేవాలని అభినందించారు



# చైనా గనిలో విషాదం

## ఘోర గ్యాస్ పేలుడు, 82 మంది మృతి

**బీజింగ్, మే 23 మన ప్రజాగళం:** : చైనాలోని ఓ బొగ్గు గనిలో జరిగిన ఘోర ప్రమాదం భారీ ప్రాణనష్టానికి దారితీసింది. ఉత్తర చైనా ప్రాంతంలోని షాంక్సీ ప్రావిన్స్‌లో ఉన్న లూషెన్యు బొగ్గు గనిలో ప్రమాదకరమైన గ్యాస్ పేలుడు సంభవించడంతో ఇప్పటివరకు 82 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. మరో తొమ్మిది మంది ఆచూకీ ఇంకా లభించకపోవడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లూషెన్యు గనిలో ఒక్కసారిగా కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకై గని అంతటా వేగంగా వ్యాపించినట్లు సమాచారం. విషవాయువు పరిమితికి మించి చేరుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో గని లోపల వందల సంఖ్యలో కార్మికులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి గని లోపలి ప్రాంతాలు పూర్తిగా దెబ్బతినడంతో కార్మికులు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే చైనా అధికారులు భారీ స్థాయిలో సహాయక చర్యలు ప్రారంభించారు. గని లోపల చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు ప్రత్యేక రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. అయితే గని లోపల విషవాయువు దట్టంగా అలముకోవడం, ఆక్సిజన్ కొరత ఏర్పడడం సహాయక చర్యలకు పెద్ద అడ్డంకిగా మారింది. కొందరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. చైనాలో గనుల భద్రతపై ఇప్పటికే అనేక విమర్శలు ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు సరిగా పాటించకపోవడం, పాత సాంకేతిక వ్యవస్థలను కొనసాగించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బొగ్గు గనుల్లో కార్మికుల ప్రాణ భద్రతకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఈ తాజా ప్రమాదంతో మరోసారి గనుల భద్రత అంశం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత గని ప్రాంతం మొత్తం విషాద వాతావరణంలో మునిగిపోయింది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ ప్రమాదం చైనా పారిశ్రామిక రంగంలో భద్రతా వ్యవస్థలపై మరోసారి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.



# పర్యాటక అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వామ్యం

- తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం
- పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం
- పర్యాటక ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు
- పర్యాటక సదస్సులో మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో నిర్వహించిన "డెస్టినేషన్ తెలంగాణ -- రోడ్ అహెడ్" పర్యాటక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్‌గా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, సంస్థలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతిపాదనలు, డీపీఆర్‌లతో వస్తే ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానంలో భాగంగా పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన వినియోగంలో లేని ఆస్తులను పర్యాటక అవసరాల కోసం దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని జూపల్లి వెల్లడించారు. పర్యాటక ప్రాజెక్టుల్లో కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతకు పెద్దపీట వేస్తామని తెలిపారు. ఎంపిక చేసిన ప్రాంతాల అభివృద్ధికి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రకటనలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. కొన్ని పర్యాటక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని మంత్రి పేర్కొన్నారు. తాగునీరు, టాయిలెట్స్, వసతి గృహాలు, రెస్టారెంట్లు వంటి సదుపాయాల ఏర్పాటుకు ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు. మొబైల్ గ్లాస్ హౌస్‌లు, కాన్వాస్ టెంట్లు వంటి ఆధునిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే అనుబంధ పరిశ్రమలు కూడా లాభపడతాయని, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా తెలంగాణలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే భువనగిరి కోటలో రోప్‌వే వంటి పర్యాటక ఆకర్షణలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు.

# మహిళా వారోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా సన్నాహాలు

- మే 25 నుంచి 31 వరకు ఘనంగా నిర్వహణ
- మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యమన్న మంత్రి సీతక్క
- సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక కార్యక్రమాలు
- మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, విద్యా పురోగతి వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా వారోత్సవాల నిర్వహణ, కార్యక్రమాల షెడ్యూల్, ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా సామాజికంగా మరింత శక్తివంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంటును ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళా సంఘాల ఆర్థిక శక్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 25న రాష్ట్రంలోని 100 గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించనున్నారు. అదే రోజు 8 వేల గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 82 అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ప్రారంభించి, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు పంపిణీ చేయనున్నారు. జిల్లా స్థాయిలో లోన్ మేళాలు కూడా నిర్వహించనున్నారు. 26వ తేదీన మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 553 ఆర్టీసీ బస్సులను ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. హైదరాబాద్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించడంతో పాటు బాల్య వివాహాల నిరోధానికి "బాల్య వివాహం బతుకు ఆగం" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా భద్రత, పోష్ చట్టంపై అవగాహన సదస్సులు, మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫార్మ్‌ల పంపిణీ వంటి పలు కార్యక్రమాలు కూడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్నారు. మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపేలా నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. మహిళా సాధికారతకు కొత్త దిశా నిర్దేశం చేసేలా ప్రతి కార్యక్రమం ఉండాలని పేర్కొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసింగ్ లక్ష్యం

- లింగంపేట్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ
- బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ సూచనలు
- పారదర్శక సేవలందించాలన్న అధికారులకు ఆదేశాలు
- బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

**కామారెడ్డి, మే 23 మన ప్రజాగళం:**
ప్రజలకు భద్రత కల్పించడం, బాధితులకు భరోసా ఇవ్వడమే పోలీసింగ్ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ అన్నారు. శనివారం లింగంపేట్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించిన ఆయన స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా బాధితులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుభూతితో విని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెరిగేలా పనిచేయాలని తెలిపారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలపై ఎస్పీ ఆరా తీశారు. కేసుల విచారణలో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు.రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీసులు అప్రమత్తంగా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ మరింత పెంచి అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుబడి పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు.






# హైదరాబాద్ పోలీసుల్లో ఏఐ విప్లవం

- భాష ఏదైనా ఫిర్యాదు నమోదు ఇక సులభం
- 'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను ఆవిష్కరించిన సీపీ సజ్జనర్
- దేశంలోనే తొలి బహుభాషా ఫిర్యాదు నమోదు వ్యవస్థ
- స్మార్ట్ పోలీసింగ్‌లో హైదరాబాద్ మరో ముందడుగు




**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక అడుగు వేసింది. భాషా సమస్యల కారణంగా బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు దేశంలోనే తొలిసారిగా "ఏఐ కాప్‌రైటర్" అనే కృత్రిమ మేధ ఆధారిత బహుభాషా ఫిర్యాదు నమోదు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. నగరంలోని 80కు పైగా పోలీస్ స్టేషన్లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను ఈ యాప్ వెంటనే రాతపూర్వక రూపంలోకి మార్చి, పోలీసులకు అర్థమయ్యే భాషలోకి అనువదిస్తుంది. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో ఇతర రాష్ట్రాల వలస కార్మికులు, పర్యాటకులు భాష తెలియక ఫిర్యాదులు ఇవ్వడంలో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా రూపొందించిన ఏఐ కాప్‌రైటర్ 10కు పైగా భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యంతో పనిచేస్తుంది. ఫిర్యాదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషించనుంది. ఈ యాప్‌లో బహుభాషా సౌలభ్యం, వేగవంతమైన ఫిర్యాదు నమోదు, పారదర్శకత వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. ఫిర్యాదు నమోదు చేసిన అధికారి వివరాలు, సమయం వంటి సమాచారం ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో భద్రపరచబడుతుంది. బాధితుడు, నిందితుడు, సాక్షుల మాటలను వేర్వేరుగా గుర్తించి నమోదు చేసే మల్టీ పార్టీ లేబులింగ్ సదుపాయం కూడా ఇందులో ఉంది. హైదరాబాద్ ఒక గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న నేపథ్యంలో భాష ఎప్పటికీ న్యాయానికి అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. వలస కార్మికులు, మహిళలు, వృద్ధులకు పోలీసు సేవలపై మరింత భరోసా పెరుగుతుందని అన్నారు. ఫిర్యాదులు యథాతథంగా నమోదు కావడం వల్ల దర్యాప్తు నాణ్యత మెరుగై నిందితులకు శిక్ష పడే అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా హైదరాబాద్ సిటీ పోలీస్ ఇప్పటికే పలు ఏఐ ఆధారిత సాంకేతికతలను వినియోగిస్తోంది. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం "సి-మిత్ర", సోషల్ మీడియా పర్యవేక్షణ కోసం "సాక్-ఐ" వంటి వ్యవస్థలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తాజా ఏఐ కాప్‌రైటర్ యాప్‌తో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ కూడా మరింత ఆధునికంగా మారనుంది.

# టీజీసీఈటీ ఫేజ్-2 ఫలితాల విడుదల

- గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి అవకాశం
- 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు
- జూన్ 7 వరకు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాలి
- విద్యార్థులకు చీఫ్ కన్వీనర్ శారద సూచనలు

**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీసీఈటీ-2026 ప్రవేశ పరీక్ష ఫేజ్-2 ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు చీఫ్ కన్వీనర్ శారద తెలిపారు. సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈ ఫలితాలను ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ ఫేజ్-2 ఫలితాల ద్వారా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పర్గి బాలికల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, ఖమ్మం బాలుర స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో 8వ తరగతి రెగ్యులర్ ప్రవేశాల కోసం కూడా ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన వివరాలను కూడా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు తమకు కేటాయించిన విద్యాసంస్థల్లో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చీఫ్ కన్వీనర్ సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలు, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో గురుకుల విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శారద పేర్కొన్నారు. గురుకుల విద్య ద్వారా అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించాలని అధికారులు సూచించారు. ప్రవేశ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు.

# తెలంగాణ పోలీసింగ్‌కు ఏఐ టెక్నాలజీ

**ఆధునిక వ్యవస్థల అనుసంధానంపై డీజీపీ సమీక్ష**

**స్మార్ట్ పోలీసింగ్ కోసం ప్రత్యేక టెక్ టీమ్ ఏర్పాటు**

**సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్ సమగ్ర అనుసంధానం**

**ప్రజలకు వేగవంతమైన సేవల లక్ష్యంగా చర్యలు**

**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం:**
తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థను మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికత వైపు కీలక అడుగులు వేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలను పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించేందుకు రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉన్న సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్, హాక్ఐ వంటి డిజిటల్ వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసే అంశంపై అధికారులు సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.పోలీస్ శాఖలో డేటా సమన్వయం, నేరాల విశ్లేషణ, సిబ్బంది నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. ఆధునిక టెక్నాలజీ సహాయంతో నేర నియంత్రణను మరింత బలోపేతం చేయడంతో పాటు విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని డీజీపీ సూచించారు. ఈ క్రమంలో ప్రత్యేక టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసి వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థను దేశంలోనే అత్యాధునికంగా తీర్చిదిద్దే దిశగా సాంకేతిక మార్పులు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.హాక్ఐ యాప్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను మరింత విస్తరించడంతో పాటు పోలీస్ శాఖ అంతర్గత వ్యవస్థలను కూడా డిజిటల్ పద్ధతుల్లో సమగ్రపరచాలని సమావేశంలో సూచించారు. పోలీస్ శాఖలో పారదర్శకత, వేగం, సమన్వయం పెంచడంలో ఈ ఆధునిక విధానాలు కీలకంగా మారనున్నాయని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ పోలీసింగ్ అమలుకు తెలంగాణ పోలీస్ శాఖ ఇప్పటికే పలు ఆధునిక కార్యక్రమాలు చేపట్టిందని, ఇప్పుడు ఏఐ సాంకేతికతతో మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కార్యాచరణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.



మన ప్రజా గళం
తెలుగు దిన పత్రిక
www.prajagalam.in
ఆదివారం 24 మే 2026

# ఆళ్లపల్లి ఆసుపత్రిపై కలెక్టర్ తనిఖీ

## - విధుల్లో లేని వైద్యాధికారిపై కలెక్టర్ ఆగ్రహం
## - రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా



**భద్రాద్రి కొత్తగూడెం, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది హాజరు, వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. తనిఖీల సమయంలో మెడికల్ అధికారి తరుణ్ విధుల్లో లేకపోవడంపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేస్తూ సంబంధిత అధికారులను వివరణ కోరాలని ఆదేశించారు. పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టికలు, రిజిస్టర్లు, సెలవుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. గైర్హాజరైన సిబ్బంది వివరాలు, డిప్యూటేషన్ విధులపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నిర్వహణ పరిస్థితులు, మందుల అందుబాటు, సేవల నాణ్యతపై సమగ్రంగా పరిశీలించారు. అవుట్ పేషెంట్ విభాగం, పరీక్షల గది, మందుల నిల్వ కేంద్రం, ఇన్ పేషెంట్ విభాగాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకుని ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రోగులకు అందుతున్న సేవల విషయంలో నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదన్నారు. ప్రస్తుతం తీవ్ర ఎండల నేపథ్యంలో వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులను కలెక్టర్ ప్రత్యేకంగా పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స, మందులు, వైద్య పర్యవేక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వడదెబ్బ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి రోగికి అత్యవసర వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో తాగునీరు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా పని చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో తాసిల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సైబరాబాద్‌లో వెటర్నరీ కార్యకలాపాల పరిశీలన

## - బాలాజీనగర్‌లో ఉదయపు ఫీల్డ్ తనిఖీలు నిర్వహించిన అధికారులు
## - వీధి కుక్కల నియంత్రణ, రేబిస్ టీకాలపై ప్రత్యేక దృష్టి
## - ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు ముమ్మరం
## - మై క్యూర్ యాప్ ద్వారా ఫిర్యాదులకు స్పందన



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజారోగ్య పరిరక్షణ, వీధి కుక్కల నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బాలాజీనగర్ వార్డు పరిధిలో అదనపు కమిషనర్ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వెటర్నరీ, ప్రజారోగ్య కార్యకలాపాలపై ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి కుక్కలను పట్టుకునే వాహనాల పనితీరు, జంతు జనన నియంత్రణ కార్యక్రమాలు, యాంటీ రేబిస్ టీకా కార్యక్రమాలను అధికారులు సమీక్షించారు. వెటర్నరీ విభాగం సిబ్బంది చేపడుతున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు జంతువులకు హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తనిఖీల్లో భాగంగా శస్త్రచికిత్సలు చేసిన వీధి కుక్కలకు టీకాలు వేయడం, వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడం జరిగింది. వీధి కుక్కల నియంత్రణ చర్యలు మానవత్వంతో సాగాలని, జంతువుల నిర్వహణలో నిబంధనలు పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు, జంతు ఆహారం అందించే వాలంటీర్లతో కూడా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ప్రజలు వీధి కుక్కల సమస్యలు, కుక్క కాట్లు, వెటర్నరీ సహాయం అవసరమైన సందర్భాల్లో మై క్యూర్ యాప్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేయాలని అధికారులు సూచించారు. యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత బృందాలు వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తాయని తెలిపారు. ప్రజల సహకారంతోనే వీధి కుక్కల సమస్యను సమర్థవంతంగా నియంత్రించగలమన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ విభాగం క్రమం తప్పకుండా జంతు జనన నియంత్రణ, యాంటీ రేబిస్ టీకా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్థానిక సమాజంతో సమన్వయం చేసుకుంటూ ప్రజారోగ్యానికి ఎటువంటి ముప్పు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల భద్రతతో పాటు జంతు సంక్షేమాన్ని కూడా సమానంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విభాగం అధికారులు, ఫీల్డ్ సిబ్బంది, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు. నగరంలో ప్రజారోగ్య పరిరక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడానికి ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# మల్కాజిగిరిలో ఉదయం తనిఖీలు

**మల్కాజిగిరి, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ శనివారం తెల్లవారుజామున బోడుప్పల్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పరిశీలన సందర్భంగా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రకటన బోర్డులను వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. రహదారులపై అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్డులు ట్రాఫిక్‌కు, ప్రజల భద్రతకు ఇబ్బందిగా మారుతున్నాయని పేర్కొన్నారు. పట్టణ సౌందర్యాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు ఉదయం 7 గంటలలోపు తాళం వేసి ఉన్న ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎలాంటి మినహాయింపులు లేకుండా వంద శాతం గృహాలను సర్వే పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలుకు ఖచ్చితమైన సమాచారం ఎంతో కీలకమని అన్నారు.రోడ్ల పక్కన పారిశుధ్య పనులు, డ్రైనేజీ మరమ్మతులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. కాలువల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. యూజీడీ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పట్టణంలో అర్బన్ పార్కుల అభివృద్ధిని వేగవంతం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపు, ప్రాథమిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తూ పర్యావరణ అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన మల్కాజిగిరిని అందించేందుకు మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు.



# ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక శనివారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న ఫీడర్ చానెల్ పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పని చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 5:30 గంటల వరకు పనులు ప్రారంభించి ఎండ తీవ్రత పెరిగేలోపు తిరిగి ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కూలీలకు రోజుకు ఎంత వేతనం అందుతోందని కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల వద్ద తాగునీరు, నీడ, ప్రాథమిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఏపీవోకు ఆదేశాలు జారీ చేశారు. కూలీలు తరచూ నీరు తాగుతూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కూలీల ఆరోగ్య రక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని కూలీలకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పనుల్లో పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన రక్షణ చర్యలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉట్కూర్ పెద్ద గ్రామ పంచాయతీ కావడంతో కనీసం 150 మంది కూలీలు ఉపాధి పనుల్లో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వల్లంపల్లి, బిజ్వార్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో కూలీల సంఖ్య తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిఆర్డీవోకు సూచించారు. ఉపాధి హామీ పనుల పురోగతి, కూలీల హాజరు వివరాలను ప్రతిరోజూ నివేదిక రూపంలో అందించాలని డిఆర్డిఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఉట్కూర్ సర్పంచ్ రేణుకా భరత్, ఎంపీవో, ఏపీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న నిల్వల తరలింపుపై ఆదేశాలు



**భద్రాద్రి కొత్తగూడెం, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, లోడింగ్, రవాణా ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నిల్వలు ఎక్కువకాలం కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి వేగంగా లోడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.లారీల కొరత లేదా హమాలీల సమస్యల కారణంగా ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే అదనపు వాహనాలను సమకూర్చి నిల్వలను త్వరితగతిన తరలించాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమన్వయంతో పనిచేస్తేనే రైతులకు ఇబ్బందులు తలెత్తవని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిల్వల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చే పంటను సకాలంలో కొనుగోలు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో తాసిల్దార్ ఉషారాణి, రవాణా శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# సీఎం పర్యటనకు పోలీసుల ఏర్పాట్లు



**కొమురంభీం ఆసిఫాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కొటారి గ్రామంలో భద్రతా, పరిపాలనా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ నితికా పంత్ శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొననున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రాకపోకలు, ప్రజల రద్దీ, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భద్రతా పరమైన అన్ని చర్యలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ నితికా పంత్, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో అవసరమైన భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.పార్కింగ్ ప్రాంతాలను కూడా పరిశీలించిన ఎస్పీ, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సులభంగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకునేలా మార్గదర్శకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ పరిశీలనలో పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర చర్యలు చేపడుతోందని అధికారులు వెల్లడించారు.

# పటాన్‌చెరు ఆసుపత్రి ప్రారంభంపై ఆగ్రహం

- ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించిన బీజేపీ నేతలు
- రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభంలో జాప్యంపై విమర్శలు
- 15 రోజుల్లో ప్రారంభించకపోతే ఆందోళన హెచ్చరిక




**సంగారెడ్డి, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రిని బీజేపీ నేతలు శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై అక్కడ చికిత్స పొందుతున్న వారిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్వహణ మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, ఇతర నాయకులు మాట్లాడుతూ పటాన్‌చెరులో నిర్మించిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ జీవో నంబర్ 82 ప్రకారం 2022 జూలై 16న రూ.184 కోట్లతో ఈ ఆసుపత్రికి నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. భవనం నిర్మాణం పూర్తై ఏడాది గడిచినా, ఆరోగ్య శాఖకు అప్పగించి నెలలు అవుతున్నా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పరిశ్రమల కాలుష్య ప్రభావంతో బాధపడుతున్న పటాన్‌చెరు ప్రజలకు ఈ ఆసుపత్రి అత్యంత అవసరమని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి ఇంకా ప్రారంభం కాకపోవడం బాధాకరమన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే ఆరోగ్య శాఖ మంత్రి ఉన్నప్పటికీ ఆసుపత్రి ప్రారంభం ఆలస్యం కావడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభాన్ని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ప్రజలు ప్రభుత్వ వైద్యం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని 15 రోజుల్లో ప్రారంభించకపోతే డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య సమస్యల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# జనగామలో ఉచిత కంటి వైద్య శిబిరం

- క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు
- 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహణ
- సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రశంసలు




**జనగామ, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ వైద్య నిపుణులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందుతున్న సేవలను కలెక్టర్ పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా చిన్న సమస్యలకైనా వెంటనే వైద్యులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. కొంతమందికి తదుపరి చికిత్స అవసరమని వైద్యులు పేర్కొన్నారు. ప్రేరణ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ అభినందించారు. సమాజానికి ఉపయోగపడే ఆరోగ్య సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సేవా సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ చైర్మన్ చింతల సాయిబాబా, వైద్యులు శ్రీకాంత్, కరుణాకర్, డీజీఓ ప్రీతి, మేనేజర్ దయాకర్, నిర్వాహకులు మల్యాల సురేష్, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో ప్రత్యేక పోలీస్ డ్రైవ్



**రాజన్న సిరిసిల్ల, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజాశాంతి భద్రతలు కాపాడటం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తూ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 85 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 50 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల సామాజిక సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజా ప్రదేశాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని వెల్లడించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి మద్యం సేవించి వాహనాలు నడపకుండా స్వచ్ఛందంగా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరారు. యువత ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశముందని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తారని అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతో సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



# బాచుపల్లిలో ప్రీ స్కూల్ ప్రారంభం



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి రేణుక ఎల్లమ్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఫస్ట్ క్రై స్మార్ట్ బీస్" ప్రీ స్కూల్, డే కేర్ స్కూల్‌ను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం ప్రారంభించారు. రంజిత్ గౌడ్ పాలమాకుల, సుమ శ్రీ బండారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు బలోపేతానికి ప్రాథమిక విద్య అత్యంత కీలకమన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యాసంస్థలు పిల్లల్లో సృజనాత్మకత, మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వాతావరణం కల్పించడం అవసరమన్నారు. స్కూల్‌లో ఏర్పాటు చేసిన తరగతి గదులు, డే కేర్ సౌకర్యాలు, విద్యా విధానాలను ఎమ్మెల్యే పరిశీలించారు. చిన్నారుల అభివృద్ధికి అనుగుణంగా అన్ని వసతులు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యా రంగంలో కొత్త ఆలోచనలతో ముందుకు రావడం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జోనల్ మేనేజర్ రవి, అకాడమిక్ మేనేజర్ కళ్యాణి, ఆపరేషన్ హెడ్ శ్రీనివాస్, పవన్, సెంటర్ మేనేజర్లు శ్వేత కోగంటి, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ ఆగం రాజు, మాజీ కౌన్సిలర్ శంబిపూర్ కృష్ణ, కార్పొరేటర్లు రవి కిరణ్, బాలాజీ నాయక్, చందు ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు సలీం, సతీష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యాసంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు కూడా ఈ కొత్త ప్రీ స్కూల్ ప్రారంభంపై ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులకు సమీపంలోనే మెరుగైన విద్యా సదుపాయాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు.

# జొన్నల కొనుగోళ్ల వేగవంతానికి ఆదేశాలు



**ఆదిలాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన అత్యవసర గూగుల్ మీట్‌లో కొనుగోళ్లు, రవాణా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. జొన్నల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన జొన్నలను గోదాములకు వేగంగా తరలించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల కొరత లేదా ఇతర కారణాలతో జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తూకం, నాణ్యత తనిఖీలు, నిల్వ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ గూగుల్ మీట్‌లో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఆర్.ఎస్.చిత్రు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్‌డీఓ రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానన్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, డీసీఎస్ఓ నందిని, సివిల్ సప్లైస్ డీఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డీసీఓ, పిన్ పాయింట్ అధికారులు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు కూడా సమావేశంలో పాల్గొని జిల్లాలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. రైతులకు మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

# ఉప్పల్‌లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** ఉప్పల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 233 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల కింద ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పెద్ద అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాలు సామాజిక భద్రతకు మంచి ఉదాహరణలని అన్నారు. పేదింటి పెళ్లిళ్లలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తులం బంగారం పథకాన్ని కూడా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పేద కుటుంబాలకు మరింత మేలు జరిగేలా సంక్షేమ కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో ఈ ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పేద కుటుంబాలకు ఊరట లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో పూల్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు.

# హెల్త్

## టాయిలెట్ క్లీనర్లు వాడుతున్నారా?..

- ఈ జాగ్రత్తలు తెలియకపోతే ప్రమాదమే!
- శుభ్రత కోసం వాడేది.. ఆరోగ్యానికి ముప్పు కాకూడదు
- రసాయనాల వినియోగంలో జాగ్రత్త అవసరం
- చిన్నపిల్లలు ఉన్న ఇళ్లలో ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి



ఇంట్లో ప్రతిరోజూ ఉపయోగించే ప్రదేశాల్లో టాయిలెట్ ఒక ముఖ్యమైన భాగం. ఇది వ్యక్తిగత పరిశుభ్రతతో నేరుగా సంబంధం కలిగి ఉండటంతో ప్రతి ఒక్కరూ తమ బాత్రూం శుభ్రంగా ఉండాలని కోరుకుంటారు. పరిశుభ్రమైన టాయిలెట్ కేవలం అందం కోసమే కాదు, ఆరోగ్య పరిరక్షణలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. చాలా మంది తమ టాయిలెట్లను ప్రతిరోజూ శుభ్రం చేస్తుంటారు. ఇది మంచి అలవాటే అయినప్పటికీ, వాటిని శుభ్రం చేయడానికి ఉపయోగించే పదార్థాల విషయంలో జాగ్రత్త అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో మార్కెట్లో లభించే అనేక టాయిలెట్ క్లీనర్లు బలమైన రసాయనాలతో తయారవుతుంటాయి. మరకలు తొలగించేందుకు కొందరు ఆమ్ల పదార్థాలను కూడా వాడుతున్నారు. ఈ రసాయన ఆధారిత ఉత్పత్తులు చర్మంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నేరుగా చేతులతో ముట్టుకోవడం వల్ల చర్మం మండటం, అలర్జీ, కళ్లకు ఇబ్బంది వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గాలి సరిగా రాని ప్రదేశాల్లో బలమైన వాసనలు శ్వాస సంబంధిత అసౌకర్యానికి దారితీయవచ్చు. చిన్నపిల్లలు ఉన్న ఇళ్లలో మరింత జాగ్రత్త అవసరం. టాయిలెట్ క్లీనర్లు, యాసిడ్ వంటి పదార్థాలను పిల్లలకు అందుబాటులో ఉంచకూడదు. ప్రమాదవశాత్తు వాటిని తాకడం లేదా తాగడం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. అందుకే వీటిని ఎత్తైన ప్రదేశాల్లో లేదా మూత ఉన్న అలమారల్లో ఉంచడం మంచిది. టాయిలెట్ శుభ్రం చేసేటప్పుడు చేతి తొడుగులు ధరించడం, గాలి సరిగా వచ్చేలా తలుపులు తెరిచి ఉంచడం, పని పూర్తయిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం వంటి అలవాట్లు పాటించాలి. ఇంటి పరిశుభ్రత ఎంత ముఖ్యమో, దాన్ని కాపాడే సమయంలో ఆరోగ్య భద్రత కూడా అంతే ముఖ్యమని గుర్తుంచుకోవాలి.

## దానిమ్మ తొక్కను చెత్తలో పడేస్తున్నారా?



దానిమ్మ పండు ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరికీ తెలుసు. రక్తహీనత తగ్గించడంలో, శరీరానికి శక్తిని అందించడంలో, రోగనిరోధక శక్తి పెంచడంలో దానిమ్మ పండుకు ప్రత్యేక స్థానం ఉంది. కానీ చాలామంది పండు తిన్న తర్వాత దాని తొక్కను పనికిరాదనుకుని చెత్తబుట్టలో పడేస్తుంటారు. అయితే ఆరోగ్య నిపుణులు చెబుతున్న విషయాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. పండులో మాత్రమే కాదు, దానిమ్మ తొక్కలో కూడా ఎన్నో ప్రయోజనకరమైన గుణాలు దాగి ఉన్నాయని వివరిస్తున్నారు. దానిమ్మ తొక్కలో యాంటీ ఆక్సిడెంట్లు, సహజ రసాయన సమ్మేళనాలు, కొన్ని ఖనిజాలు సమృద్ధిగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇవి శరీరంలో హానికర కణాల ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడవచ్చని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. శరీరంలో ఏర్పడే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో కూడా దానిమ్మ తొక్క పాత్ర ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీర్ణక్రియ విషయంలో కూడా దానిమ్మ తొక్కకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సంప్రదాయంగా కొందరు దీనిని ఎండబెట్టి పొడి తయారు చేసి ఉపయోగిస్తుంటారు. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు, కడుపు అసౌకర్యం వంటి వాటిని తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుందని పాతకాలం నుంచి నమ్మకం ఉంది. అయితే వైద్యపరంగా నిర్ధారిత చికిత్సకు బదులుగా కాకుండా, సహాయక అలవాటుగా మాత్రమే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. చర్మ సంరక్షణలో కూడా దానిమ్మ తొక్కను కొందరు ఉపయోగిస్తున్నారు. ఎండబెట్టిన తొక్కను పొడిగా చేసి పెరుగు, తేనె లేదా గులాబీ నీటితో కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుంటారు. దీని వల్ల చర్మం తాజాగా కనిపించడంలో సహాయపడుతుందని చెబుతుంటారు. చర్మంపై మృతకణాలను తొలగించడంలో కూడా కొంతమంది దీనిని ఉపయోగిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరి చర్మం ఒకేలా ఉండదు కాబట్టి ముందుగా చిన్న భాగంలో పరీక్షించడం మంచిది. నోటి ఆరోగ్యానికి కూడా దానిమ్మ తొక్క ఉపయోగపడుతుందని కొన్ని సంప్రదాయ పద్ధతులు చెబుతున్నాయి. ఎండబెట్టిన తొక్క పొడిని కొద్దిగా నీటిలో కలిపి పుక్కిలించడం వల్ల నోటి దుర్వాసన తగ్గడంలో సహాయపడవచ్చని అంటారు. చిగుళ్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఇది కొంత ఉపయోగపడుతుందని భావిస్తారు. దానిమ్మ తొక్కలను వాడాలంటే ముందుగా వాటిని శుభ్రంగా కడగడం చాలా అవసరం. మార్కెట్లో లభించే పండ్లపై రసాయనాల అవశేషాలు ఉండే అవకాశం ఉంది. కాబట్టి శుభ్రపరిచి ఎండబెట్టి మాత్రమే ఉపయోగించడం మంచిది. అలాగే ఏ ఇంటి చిట్కా అయినా మితంగా ఉపయోగించాలి. అధిక వినియోగం అనుకోని సమస్యలకు దారితీయవచ్చు. చిన్నగా కనిపించే దానిమ్మ తొక్కలో కూడా ఎన్నో ఉపయోగకరమైన అంశాలు దాగి ఉండవచ్చు. అందుకే ఇకపై దానిమ్మ తిన్న తర్వాత తొక్కను నేరుగా పడేయడానికి ముందు ఒకసారి ఆలోచించాల్సిందే.

## యువతలో పెరుగుతున్న బీపీ..

- 'సైలెంట్ కిల్లర్'పై నిర్లక్ష్యం ప్రమాదమే!
- లక్షణాలు లేకుండానే శరీరంలోకి ప్రవేశించే ముప్పు
- ఉప్పు, ఒత్తిడి, నిద్రలేమి ప్రభావం
- చిన్న మార్పులతోనే నియంత్రణ సాధ్యం





ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే చాలామంది రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. ఒకప్పుడు వయస్సు పెరిగిన తర్వాత కనిపించే సమస్యగా భావించిన బీపీ ఇప్పుడు యువతలో కూడా వేగంగా పెరుగుతోంది. వైద్య పరిభాషలో దీనిని హైపర్ టెన్షన్ అని పిలుస్తారు. స్పష్టమైన లక్షణాలు కనిపించకుండా శరీరంపై ప్రభావం చూపించే కారణంగా దీనిని చాలామంది "సైలెంట్ కిల్లర్"గా పేర్కొంటారు. రక్తపోటు సమస్య మొదట్లో బయటకు కనిపించకపోయినా లోపల గుండె, మెదడు, కిడ్నీలు, రక్తనాళాలపై ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది. కొంతమందికి తమకు బీపీ సమస్య ఉందనే విషయం కూడా తెలియకపోవడం ఆందోళన కలిగించే అంశంగా నిపుణులు చెబుతున్నారు. అందుకే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని సూచిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో లభించే ప్రాసెస్ చేసిన ఆహారం, ప్యాకెట్ పదార్థాలు, తక్షణ ఆహారాల్లో ఉప్పు పరిమాణం ఎక్కువగా ఉంటుంది. అధిక ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండి గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది. అదే సమయంలో పండ్లు, ఆకుకూరలు తక్కువగా తీసుకోవడం వల్ల అవసరమైన పోషకాలు తగ్గిపోవచ్చు. అలాగే పని ఒత్తిడి, నిద్రలేమి, అర్ధరాత్రి వరకు మొబైల్ వినియోగం కూడా బీపీ పెరగడానికి కారణమవుతున్నాయి. బీపీ ముదిరినప్పుడు కొన్ని సంకేతాలు కనిపించే అవకాశం ఉంటుంది. తరచుగా తలనొప్పి రావడం, తల తిరగడం, చూపు మసకబారడం, ఛాతీలో అసౌకర్యం, శ్వాసలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. అయితే చాలామందిలో ఎలాంటి లక్షణాలు లేకపోవచ్చని కూడా గుర్తుంచుకోవాలి. ఈ సమస్యను నియంత్రించేందుకు జీవనశైలిలో చిన్న మార్పులు చాలా ఉపయోగపడతాయి. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ఉప్పు తగ్గించడం, బరువును అదుపులో ఉంచుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం అవసరం. రోజుకు సరిపడ నిద్రతో పాటు ఒత్తిడిని తగ్గించుకునే అలవాట్లు కూడా ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగానే జాగ్రత్త పడవచ్చు.

# బిజినెస్

## టీనేజర్లకు కొత్త డిజిటల్ చెల్లింపుల సౌకర్యం




**ముంబై, మే 22 మన ప్రజాగళం న్యూస్ :** దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, టీనేజర్ల కోసం ప్రత్యేకంగా కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లేకపోతే నేరుగా యూపీఐ చెల్లింపులు చేయడం సాధ్యం కాకపోయినా, ఇప్పుడు తల్లిదండ్రుల ఆధ్వర్యంలో టీనేజర్లు కూడా తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా చెల్లింపులు చేసుకునే అవకాశం కల్పించారు. చిన్న మొత్తాల ఖర్చులు, పాఠశాల లేదా కళాశాల అవసరాలు, క్యాంటీన్ ఖర్చులు, మెట్రో ప్రయాణాలు, షాపింగ్ వంటి రోజువారీ అవసరాల కోసం ప్రతిసారీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఈ కొత్త విధానం ఉపయోగపడనుంది. ఈ విధానం ద్వారా బ్యాంకు ఖాతా కలిగిన తల్లి లేదా తండ్రి ప్రధాన వినియోగదారులుగా ఉండగా, పిల్లలను ద్వితీయ వినియోగదారులుగా చేర్చుకునే అవకాశం ఉంటుంది. దీంతో పిల్లలు తమ మొబైల్ ఫోన్ల ద్వారానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేయగలుగుతారు. ఇంతకుముందు మాదిరిగా తల్లిదండ్రుల ఫోన్ తీసుకోవడం, సంకేత సంఖ్యల కోసం వేచి చూడడం లేదా చెల్లింపు కోడ్‌ను సందేశాల ద్వారా పంపించుకోవడం వంటి ఇబ్బందులు తగ్గనున్నాయి. పిల్లలు అధికంగా ఖర్చు చేయకుండా ఉండేందుకు కొన్ని పరిమితులను కూడా అమలు చేశారు. ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.5 వేల వరకు మాత్రమే చెల్లింపులు చేయగలుగుతారు. నెల మొత్తం ఖర్చు పరిమితిని రూ.15 వేలుగా నిర్ణయించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఈ సౌకర్యాన్ని ప్రారంభించిన తొలి అరగంటలో రూ.500 వరకు మాత్రమే, మొదటి 24 గంటల్లో రూ.5 వేల వరకు మాత్రమే లావాదేవీలు చేసేందుకు అనుమతి ఉంటుంది. అదేవిధంగా పిల్లలు ఎక్కడ ఎంత ఖర్చు చేస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా ప్రత్యేక ఖర్చుల నివేదిక సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. అవసరమైతే వెంటనే యాక్సెస్‌ను నిలిపివేసే అధికారం కూడా తల్లిదండ్రులకే ఉంటుంది. డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని టీనేజర్లకు చేరువ చేస్తూనే, భద్రత మరియు ఖర్చుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది.

## ఈఎంఐలు చెల్లించకపోతే ఫోన్ ఫీచర్లు బ్లాక్

- ఆర్‌బీఐ కొత్త ప్రతిపాదనలు



**ముంబై, మే 22 మన ప్రజాగళం న్యూస్ :** దేశంలో మొబైల్ ఫోన్లు, టాబ్లెట్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఈఎంఐలపై కొనుగోలు చేసే వారి సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక ప్రతిపాదనలు తీసుకొచ్చింది. రుణగ్రహీతలు ఈఎంఐలు చెల్లించడంలో విఫలమైతే, కొన్ని కఠిన నిబంధనలు మరియు షరతులకు లోబడి, రుణదాతలు మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్‌లోని కొన్ని ఫీచర్లను రిమోట్ ద్వారా నిలిపివేయడానికి అనుమతించేలా కొత్త ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంకులు -- బాధ్యతాయుతమైన వ్యాపార ప్రవర్తన) సవరణ ఆదేశాలు, 2026' పేరుతో విడుదలైన ఈ ముసాయిదా ప్రకారం, రుణం 90 రోజులపాటు బకాయిగా ఉన్నప్పుడు మాత్రమే బ్యాంకులు లేదా రుణదాతలు పరికరాలపై పరిమితులు విధించగలరు. ఈ నిబంధనలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌బీఐ ప్రతిపాదనల ప్రకారం, ఈఎంఐ గడువు దాటిన 60 రోజుల తర్వాత రుణగ్రహీతకు మొదటి నోటీసు ఇవ్వాలి. అందులో బకాయిలు చెల్లించేందుకు 21 రోజుల గడువు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం కనీసం మరో వారం వ్యవధితో రెండో నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే ఫోన్ ఫంక్షన్లపై ఆంక్షలు అమలు చేయవచ్చు. అయితే ఈ విధానం అమలు కావాలంటే రుణ ఒప్పందంలో వినియోగదారుల స్పష్టమైన సమ్మతి తప్పనిసరిగా ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ టెక్నాలజీని కేవలం రుణ బకాయిల వసూలు కోసమే ఉపయోగించాలనీ, ఇతర ప్రయోజనాల కోసం వినియోగించరాదని ఆర్‌బీఐ పేర్కొంది. ముఖ్యంగా ఇంటర్నెట్ సేవలు, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర ఎస్ఓఎస్ ఫీచర్లు, ప్రభుత్వ హెచ్చరికలు వంటి కీలక సేవలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదని స్పష్టం చేసింది. రుణగ్రహీత బకాయిలు పూర్తిగా చెల్లించిన గంటలోపే విధించిన ఆంక్షలను తొలగించాల్సి ఉంటుంది. ఒకవేళ గంటలోపు అన్‌లాక్ చేయకపోతే సంబంధిత బ్యాంకు లేదా రుణదాత గంటకు రూ.250 చొప్పున నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. అదేవిధంగా ఫోన్ లేదా టాబ్లెట్‌పై ఆంక్షలు అమలు చేసిన సందర్భంలో వినియోగదారుల వ్యక్తిగత డేటాను బ్యాంకులు లేదా రికవరీ ఏజెంట్లు యాక్సెస్ చేయకుండా నిషేధం విధించింది. రుణ వసూలు ప్రక్రియలో వినియోగదారుల గోప్యతకు భంగం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రికవరీ ఏజెంట్ల ప్రవర్తనపై కూడా ఆర్‌బీఐ కఠిన నిబంధనలు ప్రతిపాదించింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే రుణగ్రహీతలను సంప్రదించాలనీ, బెదిరింపులు, దుర్భాషలు, అవమానాలు లేదా కుటుంబ సభ్యులను వేధించడం వంటి చర్యలను పూర్తిగా నిషేధించింది. ప్రస్తుతం భారతదేశంలో వినియోగదారు ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లలో గణనీయమైన భాగం చిన్న మొత్తాల రుణాల ద్వారానే జరుగుతోంది. దేశంలో 1.16 బిలియన్లకు పైగా మొబైల్ కనెక్షన్లు ఉన్న నేపథ్యంలో, ఆర్‌బీఐ ప్రతిపాదించిన ఈ కొత్త నిబంధనలు కోట్లాది వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## భారత్‌కు బైబై చెబుతున్న ఎఫ్ఐఐలు..




**ముంబై, మే 22 మన ప్రజాగళం న్యూస్ :** విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) భారతీయ స్టాక్ మార్కెట్లలో తమ పెట్టుబడులను క్రమంగా తగ్గించుకుంటున్నారు. ముఖ్యంగా దేశీయ అగ్రశ్రేణి బ్లూచిప్ కంపెనీల్లో భారీగా వాటాలను విక్రయిస్తుండటం మార్కెట్ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు టాప్-10 కంపెనీల్లో కీలక స్థాయిలో ఉన్న ఎఫ్ఐఐల వాటా ఇప్పుడు సగానికి పైగా తగ్గిపోయింది. 2022 మార్చిలో టాప్-10 స్టాక్స్‌లో ఎఫ్ఐఐల వాటా 40.80 శాతంగా ఉండగా, 2026 మార్చి నాటికి అది 21.20 శాతానికి పడిపోయింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన సంస్థల్లో విదేశీ మదుపర్ల మొత్తం వాటా కూడా 14 ఏళ్ల కనిష్ఠానికి చేరుకుంది. ప్రస్తుతం అది దాదాపు 14.70 శాతంగా నమోదైంది. కొన్నేళ్ల క్రితం ఇదే వాటా 18 శాతానికి సమీపంలో ఉండేది. మరోవైపు ఎమ్ఎస్‌సీఐ ఎమర్జింగ్ మార్కెట్స్ ఇండెక్స్‌లో భారత మార్కెట్ల ప్రాధాన్యం కూడా 12 శాతానికి పైగా తగ్గింది. రెండేళ్ల క్రితం అది 20 శాతాన్ని దాటింది. ట్రస్ట్‌లైన్ హోల్డింగ్స్ సీఈవో ఎన్ అరుణగిరి మాట్లాడుతూ.. భారత అగ్రశ్రేణి కంపెనీల్లో నుంచి ఎఫ్ఐఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నప్పటికీ, ఆ డబ్బును దేశీయ మధ్య తరహా లేదా చిన్న కంపెనీల్లో పెట్టడం పెద్దగా కనిపించడం లేదన్నారు. బదులుగా విదేశీ మార్కెట్ల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాతే విదేశీ మదుపర్లు భారత మార్కెట్ల నుంచి క్రమంగా బయటకు వెళ్లడం మొదలుపెట్టారని, ఇప్పుడు అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు పెరగడంతో మరింత వేగంగా పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. గత నాలుగేళ్లలో ఎఫ్ఐఐలు అత్యధికంగా దూరం పెట్టిన రంగాల్లో ఐటీ మరియు ఫైనాన్స్ రంగాలే ముందున్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా వంటి ఐటీ కంపెనీల్లో వారి వాటాలు దాదాపు 7.70 శాతం తగ్గాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి ఆర్థిక రంగ దిగ్గజాల్లో కూడా విదేశీ పెట్టుబడులు 6.60 శాతం మేర పడిపోయాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ బలహీనపడటం కూడా ఎఫ్ఐఐలను పెట్టుబడుల ఉపసంహరణ వైపు నడిపిస్తోంది. 2022 మార్చి నుంచి 2026 మార్చి వరకు నిఫ్టీ రాబడులు కేవలం 35 శాతంగా ఉండగా, అమెరికా ఎస్అండ్‌పీ 500 సూచీ 60 శాతానికి పైగా లాభాలను అందించింది. దీంతో భారతీయ ఈక్విటీల కంటే విదేశీ మార్కెట్లే మెరుగైన రాబడులు ఇస్తున్నాయనే అభిప్రాయం విదేశీ మదుపర్లలో బలపడుతోంది. ఇదిలా ఉండగా, పార్లే ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్లు బుధవారం మార్కెట్లో అనూహ్యంగా దూసుకెళ్లాయి. కంపెనీ షేర్ ధర 5 శాతం ఎగిసి అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ.5.25 వద్ద నమోదైంది. విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి 'మెలోడీ' చాక్లెట్లు బహుమతిగా ఇవ్వడం దీనికి కారణమైంది. 'మోదీ' మరియు 'మెలోనీ' పేర్ల కలయికతో సోషల్ మీడియాలో 'మెలోడీ' ట్రెండ్ కావడంతో, మదుపర్లు పొరపాటున పార్లే ఇండస్ట్రీస్ షేర్లను కొనుగోలు చేశారు. అయితే అసలు మెలోడీ చాక్లెట్లు తయారు చేసే పార్లే ప్రొడక్ట్స్ సంస్థకు, స్టాక్ మార్కెట్లో నమోదైన పార్లే ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు ఎలాంటి సంబంధం లేదు. పార్లే ఇండస్ట్రీస్ ప్రధానంగా ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్, పేపర్ మరియు వేస్ట్ పేపర్ ఉత్పత్తుల వ్యాపారంలో కొనసాగుతోంది. మరోవైపు పార్లే ప్రొడక్ట్స్ సంస్థ మెలోడీ, కచ్చా మ్యాంగో బైట్, పార్లే-జీ, మోనాకో, క్రాక్‌జాక్, హైడ్ అండ్ సీక్ వంటి ప్రసిద్ధ ఉత్పత్తులను తయారు చేస్తోంది.

# ఏఐ డీప్‌ఫేక్‌పై రుక్మిణి ఆగ్రహం



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన నకిలీ బికినీ ఫోటోలు, వీడియో క్లిప్స్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. గ్రీన్ కలర్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లో కనిపిస్తున్నట్లు ఉన్న ఆ విజువల్స్ నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీశాయి. చుట్టూ కెమెరాలు, సాంకేతిక సిబ్బంది కనిపించడంతో ఇది ఏదైనా అధికారిక ఫోటోషూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం అవి కృత్రిమ మేధస్సు సాంకేతికతతో తయారు చేసిన డీప్‌ఫేక్ చిత్రాలేమోనని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ వివాదం మరింత వైరల్ కావడంతో తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందించారు. ఇంటర్నెట్‌లో తన పేరిట ప్రచారం అవుతున్న బికినీ ఫోటోలు, వీడియోలు పూర్తిగా కృత్రిమ మేధస్సు సాయంతో తయారు చేసిన నకిలీ చిత్రాలేనని ఆమె స్పష్టం చేశారు. అవి పూర్తిగా తప్పుడు సమాచారం ఆధారంగా సృష్టించబడినవని పేర్కొన్నారు. ఇతరుల వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసేలా ఇలాంటి మార్ఫింగ్ కంటెంట్ తయారు చేయడం, వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జాన్వీకి కోలీవుడ్ ఛాన్స్



బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యువ నటి జాన్వీ కపూర్ ఇప్పుడు దక్షిణాది చిత్రసీమలో మరింత బిజీ అవుతున్నట్లు తెలుస్తోంది. దివంగత నటి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన జాన్వీ, ఇప్పటికే తెలుగు చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పుడు ఆమె తమిళ చిత్రసీమలోకి కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నారనే వార్త సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, తమిళ స్టార్ నటుడు విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ సరసన జాన్వీ నటించే అవకాశాలు ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యువ దర్శకుడు గణేష్ కె బాబు తెరకెక్కించనున్న ఈ చిత్రంలో ప్రేమ, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను కలిపిన యూత్‌ఫుల్ కథ ఉండబోతున్నట్లు సమాచారం. ధ్రువ్ విక్రమ్ నటన శైలికి, జాన్వీ గ్లామర్ ఇమేజ్‌కు తగ్గట్టుగా కథను ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# పెళ్లి కారణంగా అవకాశం కోల్పోయా



గ్లామర్ రంగంలో మహిళల వ్యక్తిగత జీవితం కూడా కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లైందనే కారణంతో ఒక పెద్ద సినిమా అవకాశం కోల్పోయానని ఆమె వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇచ్చానని, నటన, రూపం పరంగా తనను ఎంపిక చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిపింది. ఆ పాత్రకు తానే సరైన ఎంపిక అన్న సంకేతాలు కూడా వచ్చాయని చెప్పింది. అయితే చివరి దశ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు అడిగారని స్రవంతి వెల్లడించింది. "నాకు పెళ్లైందా అని అడిగారు. నేను నిజాయితీగా అవునని చెప్పాను. ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి మారిపోయింది" అని తెలిపింది. ముందుగా షూటింగ్ కోసం చెన్నై రావాలని, అడ్వాన్స్ కూడా ఇస్తామని చెప్పారని గుర్తుచేసుకుంది. కానీ పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేస్తామని చెప్పిన వారు మళ్లీ స్పందించలేదని పేర్కొంది. చివరకు ఆ సినిమా అవకాశం తనకు రాలేదని వెల్లడించింది. తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయిందని స్రవంతి చెప్పుకొచ్చింది. అయితే ఆ సంఘటన తనను మానసికంగా నిరాశపరిచినా, కెరీర్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపింది. కష్టపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంది.

# ధోనీనే సీఎస్‌కే కోచ్‌గా తీసుకోవాలి: అశ్విన్

**చెన్నై, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌పై మాజీ భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఫ్లెమింగ్‌ను కోచ్ పదవి నుంచి తప్పించాలని భావిస్తే కొత్త కోచ్ కోసం బయట వెతకాల్సిన అవసరం లేదని, మహేంద్రసింగ్ ధోనీనే ఆ బాధ్యతలకు సరైన వ్యక్తి అని పేర్కొన్నాడు. సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన అశ్విన్.. ధోనీ ఇప్పటికే జట్టు డగౌట్‌లోనే ఉన్నాడని గుర్తు చేశాడు. స్టీఫెన్ ఫ్లెమింగ్ 2009 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు కోచ్‌గా కొనసాగుతున్నాడు. అతని హయాంలో జట్టు ఐదు సార్లు టైటిల్ గెలుచుకుని ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిచింది. అయినప్పటికీ గత మూడు సీజన్లుగా చెన్నై ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోవడం అభిమానుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ప్రస్తుతం టీ20 క్రికెట్ పూర్తిగా దూకుడు ఆట వైపు మారిపోయిందని, ఇతర జట్లు భారీ హిట్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంటే చెన్నై మాత్రం ఇంకా పాత వ్యూహాలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాహుల్




త్రిపాఠీ, దీపక్ హుడా, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు జట్టులో ఆశించిన స్థాయిలో రాణించకపోవడానికి ఇదే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్ కోల్పోవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. టాప్ ఆర్డర్‌లో నిలకడ లేకపోవడంతో భారీ స్కోర్లు నమోదు చేయడంలో చెన్నై విఫలమైంది. బౌలింగ్ విభాగంలో నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ మంచి ప్రదర్శన చేస్తున్నప్పటికీ మొత్తం యూనిట్‌గా మాత్రం ప్రభావం చూపలేకపోతోంది. గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్ల బౌలింగ్‌లో కనిపిస్తున్న పదును చెన్నైలో కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక గాయం కారణంగా మహేంద్రసింగ్ ధోనీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపిందని అభిమానులు అంటున్నారు. ధోనీ లేని లోటు నాయకత్వంలో స్పష్టంగా కనిపించిందని, ఆయన తిరిగి జట్టులో కీలక బాధ్యతలు చేపట్టాలని కోరుతున్నారు.

# క్రునాల్ బౌలింగ్‌పై కావ్య అసహనం

**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో హైదరాబాద్ వేదికగా జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ క్రునాల్ పాండ్య వేసిన వింత బౌలింగ్‌పై సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఆర్‌సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడగా.. అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ కూడా భారీ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయితే మ్యాచ్ సందర్భంగా క్రునాల్ పాండ్య వేసిన కొన్ని బంతులు ప్రత్యేక చర్చకు దారితీశాయి. సాధారణంగా ఎడమచేతి స్పిన్ బౌలర్ అయిన క్రునాల్.. బ్యాటర్లను గందరగోళానికి గురిచేయడానికి అప్పుడప్పుడు భిన్నమైన బంతులు వేస్తుంటాడు. కానీ ఈ మ్యాచ్‌లో అతను వరుసగా బౌన్సర్లు వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేసిన క్రునాల్.. నాలుగు నుంచి ఆరు వరకు బౌన్సర్లు సంధించాడు. స్పిన్ బౌలర్ నుంచి ఇలాంటి బంతులు రావడంతో క్రీజులో ఉన్న బ్యాటర్లు కూడా అసౌకర్యానికి గురయ్యారు. వికెట్ కీపర్ జితేష్ శర్మ కూడా కొన్ని బంతులను అందుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. ఈ దృశ్యాలను స్టాండ్స్‌లో నుంచి గమనిస్తున్న కావ్య మారన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన పక్కన ఉన్న వారితో మాట్లాడుతూ "ఇది ఏ బౌలింగ్?" అన్నట్లుగా చేతులూపుతూ అసంతృప్తిని బయటపెట్టారు. ఆమె రియాక్షన్ కెమెరాలో బంధించబడటంతో వీడియో వేగంగా వైరల్ అయింది. ఆ తర్వాత 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయింది. విరాట్ కోహ్లీ, వెంకటేష్ అయ్యర్ త్వరగా ఔటవ్వడంతో జట్టు ఒత్తిడిలో పడింది. మధ్యలో రజత్ పటిదార్, క్రునాల్ పాండ్య, టిమ్ డేవిడ్ పోరాడినా ఫలితం లేకపోయింది. చివరకు ఆర్‌సీబీ 200 పరుగులకే పరిమితమవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.






# అభిషేక్ శర్మ అరుదైన రికార్డు



**హైదరాబాద్, మే 23 మన ప్రజాగళం న్యూస్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన కీలక మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఈ యువ బ్యాటర్.. ప్రత్యర్థి బౌలర్లపై సిక్సర్ల వర్షం కురిపించాడు. కేవలం 22 బంతుల్లోనే 56 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. తన ఇన్నింగ్స్‌లో ఐదు భారీ సిక్సర్లు, నాలుగు ఫోర్లు బాదుతూ స్టేడియాన్ని హోరెత్తించాడు. ఈ దూకుడు ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ అరుదైన రికార్డును తన పేరిట నమోదు చేసుకున్నాడు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు అతను మొత్తం 43 సిక్సర్లు బాదాడు. దీంతో వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో 40కిపైగా సిక్సర్లు కొట్టిన తొలి భారతీయ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. గత సీజన్‌లో కూడా అతను 42 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఐపీఎల్ చరిత్రలో మూడు వేర్వేరు సీజన్లలో 40కిపైగా సిక్సర్లు బాదిన రికార్డు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. ఇప్పుడు ఆ జాబితాలో గేల్ తర్వాత నిలిచిన ఏకైక భారతీయ ఆటగాడిగా అభిషేక్ శర్మ గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పవర్‌ప్లే ఓవర్లలో అతని దూకుడు బ్యాటింగ్ సన్‌రైజర్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సీజన్ మొత్తం అభిషేక్ శర్మ అత్యంత ప్రమాదకర ఓపెనర్‌గా నిలుస్తున్నాడు. బౌలర్లపై ఏమాత్రం ఒత్తిడి లేకుండా ఎదురుదాడి చేస్తూ జట్టుకు వేగవంతమైన ఆరంభాలు అందిస్తున్నాడు. అతని ప్రదర్శనపై మాజీ క్రికెటర్లు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. భవిష్యత్తులో భారత జట్టుకు కీలక ఆటగాడిగా అభిషేక్ ఎదిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.